క్లుప్తంగా

నేడు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు

ప్రత్తిపాడు: జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలికా సాధికారత అంశంపై వ్యాస రచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించడం జరుగుతుందని ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు సీడీపీవో వి.సుజాతదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని పేర్కొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

పొన్నూరు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.చంద్రశేఖరరావు గురువారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భవనం పద్మలీల అధ్యక్షతన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. అన్ని శాఖల అధికారులు పాల్గొని పేర్కొన్నారు.

25, 26న గాయత్రీ దీప మహాయజ్ఞం

పొన్నూరు: అఖిల విశ్వ గాయత్రీ పరివార్ పొన్నూరు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో పట్టణంలోని శ్రీ సాక్షి భావన్నారాయణ స్వామి దేవస్థానం ప్రాంగణంలో 24 దీపాలతో గాయత్రి దీప మహా యజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు కలశ శోభాయాత్ర, సాయంత్రం 6 గంటలకు 2,400 దీపాలతో దీప మహాయజ్ఞం, ఆదివారం ఉదయం 7 గంటలకు గోపూజ, 8 గంటల నుంచి గాయత్రి మహాయజ్ఞం, సంస్కారాలు, పూర్ణాహుతి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

సీసీ రోడ్డు ప్రారంభం



పొన్నూరు: మండల పరిధిలోని దొప్పలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులను, ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును గురువారం ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెదకాకాని: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో శుక్రవారం జరుగుతుందని ఎంపీడీఓ ఆర్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని తెలిపారు.

కళ్లం కళాశాలలో ఉచిత వైద్య శిబిరం



గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కళ్ల ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. అమృత హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ మద్ది వినోద్‌కుమార్ మాట్లాడుతూ జాయింట్ రీప్లేస్‌మెంట్ గురించి వివరించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డి శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

దళితవాడలో సమస్యలు పరిష్కరించాలి

కాకుమాను : దళిత కాలనీల సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘం నాయకులు దొప్పలపూడి రమేష్ కోరారు. పెదనందిపాడు మండలంలోని పెదనందిపాడు, నాగులపాడు గ్రామాల్లోని దళి కాలనీల్లో గురువారం కార్మిక సంఘ నాయకులు పర్యటించి, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ అనేక గ్రామాలలో దళిత కాలనీలో సరైన వసతులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నాగులపాడు స్మశాన వాటిక పల్లంగా ఉండడంతో సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. కాలనీ వాసుల సమస్యలపై తహసీల్దార్, ఎంపీడీఓలకు వినతి పత్రాన్ని అందజేశారు.

పరిశుభ్రతపై అవగాహన

గుంటూరు రూరల్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అంకిరెడ్డిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సరోజిని అన్నారు. గురువారం పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఆర్.విజయకుమారి, నిర్మలకుమారి బొమ్మలకు స్కూల్ యూనిఫామ్ ధరింపజేసి వివరించారు. పరిశుభ్రమైన వాతావరణంతో చక్కటి విద్య సాధ్యమవుతుందని తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యుల నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసింది. రాత్రి వేళ అందాల్సిన అత్యవసర వైద్య సేవలను అటకెక్కిస్తోంది. పేద ప్రజల ఆరోగ్యంతో పరిహాసాలాడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 24 గంటలూ పనిచేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కూటమి ప్రభుత్వంలో సాయంత్రానికే మూత బడుతున్నాయి. అందుకు నిదర్శనమే పెదనందిపాడు పీహెచ్‌సీ..

- సాయంత్రానికి వైద్య సేవలు బంద్..
- రాత్రిళ్లు అందుబాటులో లేని డాక్టర్లు, స్టాఫ్ నర్స్‌లు
- పెదనందిపాడు పీహెచ్‌సీ సిబ్బంది తీరుపై రోగుల ఆగ్రహం
- అత్యవసర చికిత్సలకు ప్రత్తిపాడు, గుంటూరుకు పరుగులు
- స్థానిక ఎమ్మెల్యే చెప్పినా నిర్లక్ష్యం వీడని వైద్యులు



రాత్రి వేళ పీహెచ్‌సీలోని రిసెప్షన్ సెంటర్



తాళాలు వేసి ఉన్న మాత్రల డిస్పెన్సరీ

ప్రత్తిపాడు: పెదనందిపాడు పీహెచ్‌సీలో రోగులకు సేవలు అందించేందుకు ప్రభుత్వం ఇద్దరు వైద్యాధికారులు, ఇద్దరు స్టాఫ్ నర్సులను నియమించింది. కానీ కాల్ డ్యూటీ పేరుతో వైద్యులు సాయంత్రం 4 గంటల తర్వాత అందుబాటులో ఉండటం లేదు. ఇక స్టాఫ్ నర్సులు కూడా సాయంత్రం ఐదారు గంటల తర్వాత ఆస్పత్రి వదిలేసి వెళ్లిపోతున్నారు. దీంతో మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకూ రోగులకు వైద్య సేవలు అందని దుస్థితి నెలకొంది.

ప్రత్తిపాడు, గుంటూరుకు పరుగులు

పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది రాత్రిళ్లు అందుబాటులో లేకపోతుండటంతో రోగులు.. అత్యవసర చికిత్సలకు గుంటూరు, ప్రత్తిపాడుకు పరుగులు పెడుతున్నారు. కొద్దిరోజులుగా ఇదే తంతు నడుస్తున్నా.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

ఎమ్మెల్యే విజిట్ వ్యర్థమేనా..

పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఇప్పటికి రెండుసార్లు సందర్శించి, మెరుగైన సేవలు ప్రజలకు అందించాలని వైద్యులను ఆదేశించారు. కానీ, అక్కడి సిబ్బంది ఎమ్మెల్యే మాటలను బుట్టదాఖలు చేస్తున్నారు. అదే సమయంలో సిబ్బంది సైతం ఎమ్మెల్యేకు కొన్ని సమస్యలను విన్నవించారు. అవి పరిష్కారానికి నోచుకోలేదు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



ఆర్థిక సాయం అందజేస్తున్న యూనియన్ నాయకులు

పొన్నూరు: భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు అరేటి రామారావు కోరారు. నిడుబ్రోలు నార్త్ క్యాబిన్ పేటకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు కలవకొల్లు వెంకటేష్(30) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఏఐటీయూసీ నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని ఇచ్చిన హామీని నేటికీ నెరవేర్చలేదని విమర్శించారు. వెంకటేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మిక్కిలి జాన్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం వెంటనే గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అనంతరం వెంకటేశ్ కుటుంబానికి యూనియన్ నాయకులు రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు మరియదాస్, కోశాధికారి శరత్ బాబు, కన్న, రామయ్య పాల్గొన్నారు.

చిట్టీ డబ్బులు ఎగ్గొట్టి.. అడిగినందుకు దుర్భాషలాడి

మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

చేబ్రోలు: చిట్టీ కట్టించుకున్న వ్యక్తి డబ్బులు ఇవ్వకపోవడమే కాకుండా.. అడిగినందుకు కులం పేరుతో తనను దుర్భాషలాడాడని ఓ వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించాడు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. చనిపోయే ముందు మృతుడి వాంగ్మూలం మేరకు చేబ్రోలు ఎస్సై డీవీ కృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. వట్టిచెరుకూరు మండలం కోవెలముడి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కొండ్రు కుమార్(35)కు చేబ్రోలు గ్రామానికి చెందిన కాలేపల్లి శివరామకృష్ణతో పరిచయం ఏర్పడింది. శివరామకృష్ణ వద్ద కుమార్ రూ.6 లక్షల చిట్టీ ఒకటి వేశాడు. చిట్టీ పూర్తయిన శివరామకృష్ణ డబ్బులు చెల్లించలేదు. కుమార్ తన కుమార్తె పుష్పవతి ఫంక్షన్ కోసం డబ్బులు అవసరం కావడంతో తన భార్య సౌందర్యతో కలిసి శివరాం ఇంటికి వెళ్లాడు. డబ్బులు అడగడంతో శివరాం, అతని భార్య, తల్లి నీచంగా దుర్భాషలాడటమే కాకుండా కులం పేరుతో దూషించారు. చిట్టీలు కట్టేందుకు అప్పులు చేయడం, బాకీ తీర్చే అవకాశం లేకపోవడం, శివరాం బెదిరింపులతో మనస్తాపం చెందిన కుమార్ ఈ నెల 21న నారాకోడూరు కారం మిల్లు ఎదురు పొలాల్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఇది గమనించిన ఆటో డ్రైవర్లు అతనిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కొండ్రు కుమార్ మరణించాడు. చనిపోయే ముందు ఆత్మహత్య కారణాలను తన వాంగ్మూలంలో పేర్కొన్నాడు.

ఆర్‌వీఆర్ జేసీలో కాలుష్య నియంత్రణపై సదస్సు



అతిథిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: కాలుష్య నివారణకు విద్యార్థులు సాంకేతికతతో కూడిన వినూత్న ఆలోచన చేసి, ప్రభుత్వ కార్యక్రమాలకు తోడ్పాటు అందించాలని ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ ఆఫీసర్ ఎండీ నజీనా బేగం కోరారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో పొల్యూషన్ కంట్రోల్ యాస్పెక్ట్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. వివిధ దేశాలు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కాలుష్య నియంత్రణకు అవలంబిస్తున్న పద్ధతులను నజీనా బేగం వివరించారు. వ్యర్థాల రీసైక్లింగ్‌కు విద్యార్థులు ప్రయోగాత్మకంగా ఆలోచనల ప్రతిపాదనలను అందజేస్తే అవసరమైన నిధుల తోడ్పాటుకు సహకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థల్లో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని తెలిపారు. నజీనా బేగం పూర్వ విద్యార్థిని కావడం ఆనందకరమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ కె.రమేష్ చంద్ర పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు నేతాజీ



నేతాజీ చిత్రపటానికి నివాళి



పెదకాకాని గ్రంథాలయంలో నేతాజీ చిత్రపటానికి నివాళి

కాకుమాను: నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిరస్మరణీయులని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. భారత స్వాతంత్ర్య పిపాసి, జై హింద్ నినాద సృష్టికర్త, అజాద్ హింద్ ఫౌజ్ స్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోసు జీవితాన్ని నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. నేతాజీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి పి.సుభాషిణి, విశ్రాంత ఉపాధ్యాయులు గారపాటి రమేష్, బోరుగడ్డ శాంసన్, గుగ్గిలం సాయిబాబు, సురేష్, ఆనందరావు, మంజుల ఉన్నారు.

నేతాజీకి నివాళి

పెదకాకాని: పెదకాకాని గ్రంథాలయంలో గురువారం లైబ్రేరియన్ వేముల విజయ్‌కుమార్ అధ్యక్షతన నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలు నిర్వహించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆనందరావు మాట్లాడుతూ నేతాజీ జయంతిని పరాక్రమ్ దివస్‌గా జరుపుకుంటున్నామని తెలిపారు. ఉపాధ్యాయని నాగలక్ష్మి, రాధిక పాల్గొన్నారు.

కేవీలో క్విజ్ పోటీలు



గుంటూరు రూరల్: నల్లపాడు పీఎం కేంద్రియ విద్యాలయంలో గురువారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పరీక్షా పే చర్చ (8వ ఎడిషన్)లో భాగంగా పరాక్రమ్ దివస్‌ను పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థుల్లో దేశభక్తిని పొందించడం కోసం ఈ క్విజ్‌ను నిర్వహించామన్నారు. రాయపూడి, వెంగళాయపాలెం జెడ్పీ పాఠశాలలు, శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్, బాసర కాన్సెప్ట్ స్కూల్, తెనాలి కేంద్రియ విద్యాలయం మొత్తం 10 పాఠశాలల నుంచి మొత్తం 104 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. మొదటి, రెండవ, మూడవ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం రేట్ తగ్గించేందుకు కృషి

గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ జి.భానూదయ



ప్రత్తిపాడు: క్రైం రేట్ తగ్గించేందుకు కృషి చేస్తామని గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ జి.భానూదయ అన్నారు. ఇటీవలే గుంటూరు డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆమె గురువారం ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. స్టేషను రికార్డులను పరిశీలించారు. అనంతరం సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించి, స్థానిక, నియోజకవర్గ స్థితిగతులు, నేరాలు, కేసుల పురోగతి వంటి పలు విషయాలను సీఐ జి. శ్రీనివాసరావు, ఎస్‌ఐ కె.నాగేంద్రను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఆరా తీశారు. నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని డీఎస్పీ

శాంతిభద్రతలను పరిరక్షించాలి

కాకుమాను: గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా శాంతి భద్రతలపై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఎస్పీ భానోదయ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం రాత్రి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రక్షణ కల్పించాలన్నారు. అనుమానిత వ్యక్తులు కనిపడితే వెంటనే వారిని అదుపులోకి తీసుకుని, వివరాలు సేకరించాలని తెలిపారు. ప్రత్తిపాడు సీఐ జి.శ్రీనివాసరావు, ఎస్‌ఐ ఏక్‌నాథ్, సిబ్బంది ఉన్నారు. చెప్పారు.

అప్పాపురం, రేటూరులో పొలం 'పిలుస్తోంది'



అప్పాపురం(కాకుమాను): రబీ సీజన్‌లో రెండో పంటగా దాళ్వా వరి సాగు చేస్తున్న చేస్తున్న జింకు లోపం లేకుండా చూసుకోవాలని ఏఓ కె.కిరణ్మయి తెలిపారు. అప్పాపురం, రేటూరు గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఎకరాకు ఒక కేజీ ముడి జింకును పంటపై పిచికారి చేయాలని ఆమె సూచించారు. సాగు విషయంలో సందేహాలు ఉంటే కార్యాలయంలో సంప్రదించి, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు మేరకు ఎరువులు ఉపయోగించాలని ఆమె తెలిపారు. సర్పంచ్‌లు పొందుగుల ఆచారి, షేక్ సైద పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కౌట్స్ యూనిఫాం బహూకరణ



చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మదర్ థెరీసా గైడ్ యూనిట్‌ను ప్రారంభించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రెటరీ, ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు స్కౌట్ వ్యవస్థాపకుడు బ్రెడెన్ పోల్ చిత్రపటానికి పూలమాలనేసి నివాళులర్పించారు. విద్యార్థులకు స్కౌట్ యూనిఫాం బహూకరించడం జరిగింది. నూతనంగా చేరిన 32 మంది బాలికలతో గైడ్ ప్రతిజ్ఞ చేయించారు. స్కౌట్ మాస్టర్ డిస్ట్రిక్ ట్రైనింగ్ ఆఫీసర్ తాటి నరేష్ విద్యార్థులనుస్కౌట్‌లోకి ఆహ్వానించారు. పాఠశాల స్కౌట్ మాస్టర్ సీహెచ్ నాగేశ్వరావు, రమేష్, గైడ్ కెప్టెన్ ఈ మాధవీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి చెరువులో పడి వ్యక్తి మృతి



కాకుమాను: ప్రమాదవ శాత్తు తాగునీటి చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం మండల కేంద్రం కాకుమానులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ.ఏక్‌నాథ్ సమాచారం మేరకు.. కాకుమాను గ్రామానికి చెందిన సూరె శ్రీనివాసరావు(58) కుటుంబ సభ్యులతో పనిమీద బయటకు వెళ్లి వస్తానని చెప్పి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. గ్రామంలో ఉన్న తాగునీటి చెరువులో ప్రమాదశాత్తు పడి మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రజా వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భవిష్యత్తు అంతా ఏఐ టెక్నాలజీతోనే

ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ చందు రామారావు



మాట్లాడతున్న అభినవ్ భట్టాచార్య, డి భరత్, చైర్మన్ రామారావు, ప్రిన్సిపల్

ప్రత్తిపాడు: భవిష్యత్తు అంతా ఏఐ టెక్నాలజీ మీదనే ఆధారపడి ఉంటుందని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ చందు రామారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం అన్‌లాక్ ద ఫ్యూచర్ ఆఫ్ ప్లేస్‌మెంట్ విత్ స్టార్క్ ఏఐ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన గ్రోత్ అండ్ స్ట్రాటజీ హెడ్ అభినవ్ భట్టాచార్య, డి.భరత్, పి.మోహన్ క్యాంపస్ డ్రైవ్స్‌లో ఉద్యోగాలు సాధించాలంటే ప్రణాళికలు ఎలా ఉండాలి, ఏ విధమైన జాగ్రత్తలు పాటించాలి, నూతన టెక్నాలజీని ఎలా అందిపుచ్చుకోవాలని, సిలబస్‌పై పట్టు ఎలా సాధించాలి.. వంటి పలు అంశాలను విద్యార్థులకు వివరించారు. ఏఐ ఆధారంగా రెజ్యూమ్‌ను ఎలా రూపొందించుకోవాలన్న అంశాన్ని తెలియజేశారు. చైర్మన్ రామారావు మాట్లాడుతూ విద్యార్థులు ఏఐపై పూర్తి పట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి.వి.ఎస్ ఫణికుమార్, వైస్ ప్రిన్సిపల్ కె.కిరణ్‌కుమార్, డైరెక్టర్ చందు రవికుమార్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారులకు సీసీఎల్ రుణాలు

ప్రత్తిపాడు: గృహ లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు వీలుగా డీఆర్‌డీఏ నుంచి ఆర్థిక సహకారం అందించాలని ఎంపీడీవో కె.శివపార్వతి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం వెలుగు వీవోఏలు, సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో శివపార్వతి మాట్లాడుతూ గృహ లబ్ధిదారులకు మండల సమాఖ్య నుంచి సీసీఎల్ రుణాలు ఇవ్వాలని, ఆ దిశగా వీవోఏలు విధులు నిర్వర్తించాలని చెప్పారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లోని డ్వాక్రా మహిళలకు నిస్వార్థంగా సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం మహిళా సంఘాల అభ్యున్నతికి, మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతను అందిస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధిని పెంచుకునేలా మహిళలను ప్రోత్సహిస్తూ, వారికి అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఏపీఎం వి.లాజరు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లో నిరక్షరాస్యులుగా ఉన్న మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. అదేవిధంగా లక్‌పత్ దీదీ వంటి ఆర్థిక ఆసరా కార్యక్రమాలు కూడా చేపడుతోందన్నారు. ఈ సమావేశంలో సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

నేతాజీ మన్నించు



రాజకీయ నేతల జయంతి, వర్ధంతులకు నానా హడివిడీ చేసే నాయకులు స్వాతంత్ర్య సమర యోధులను విస్మరిస్తున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కీలక భూమిక పోషించిన ధీరుడిని నేటి తరం మరిచిపోతోంది. అందుకు నిదర్శనమే ఈ చిత్రం. గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి. పెదనందిపాడు మండలం వరగాని మెయిన్ సెంటరులో ఉన్న నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించే వారే కరువయ్యారు. కనీసం విగ్రహాన్ని శుభ్రం కూడా చెయ్యకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఎప్పుడో నేతాజీ విగ్రహానికి వేసిన దండలు ఇలా వాడి దర్శనమిస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన రెండు నెలలకు 1947 అక్టోబరు 2న అప్పటి మద్రాసు గవర్నమెంటు లోకల్ బోర్డ్స్ మినిస్టర్ కల్లూరి చంద్రమౌళి ఈ విగ్రహన్ని ఇక్కడ ఆవిష్కరించారు. ప్రభుత్వ యంత్రాంగం కూడా నేతాజీని మరిచిపోవడం బాధాకరం.

– ప్రత్తిపాడు

ఏఐటీయూసీ మహాసభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న పుప్పాల సత్యన్నారాయణ

పెదకాకాని: ఆటో రంగాన్ని పరిశ్రమగా గుర్తించి, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల సత్యన్నారాయణ కోరారు. ఏఐటీయూసీ గుంటూరు జిల్లా 8వ మహా సభలను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ గురువారం గుంటూరు ఆటో నగర్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పుప్పాల మాట్లాడుతూ ఆటో కార్మికులకు జీరో వడ్డీతో బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఒక్కొక్క కార్మికుడికి రూ.15 వేల సాయం అందిస్తామన్న వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలన్నారు. శుక్రవారం గుంటూరు సీపీఐ కార్యాలయంలో జరిగే ఆటో డ్రైవర్, వర్కర్స్ యూనియన్ జిల్లా మహా సభలను జయప్రదం చేయాలన్నారు. త్రిపర్ణ ఈశ్వరరావు, నరసింహారెడ్డి శ్రీనివాసరెడ్డి, హనిమిరెడ్డి ప్రభాకర రెడ్డి, శివకేలం శ్రీనివాసరావు, రెడ్డి రాములు, కొండారెడ్డి, శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



కాకుమాను: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. పెదనందిపాడు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సీపీఎం మండల కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు కొత్త వెంకట శివరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథి పాశం రామారావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజలకు మాయ మాటలు చెప్పి, అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా.. నేటి వరకు ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదనందిపాడు మండలంలోని గ్రామాల్లో తాగు, సాగు నీటి సమస్య ఏళ్ల తరబడి ఉన్నా.. పరిష్కరించడం లేదన్నారు. పార్టీ నాయకులు దొప్పటపూడి రమేష్ బాబు, జంపని రామారావు, డి.శ్రీనివాసరావు, భువనేశ్వరి, మద్రి లక్ష్మీ, పఠాన్ సలీం, నల్లమోతు రాజేంద్ర పాల్గొన్నారు.